# సుబ్బారావు కొత్త సెల్లు

**నారాయణరాజు**

ఏజీ ఆఫీసులో పనిచేసే సుబ్బారావుకు సెల్ ఫోన్ అంటే చాలా ముచ్చట. ఇంత కాలం భార్య అనుమతి ఇవ్వకపోవడంతో వాయిదా వేస్తూ వచ్చాడు. కాని క్రమంగా ఆ కోరిక బలంగా పెరగసాగింది. ఇటీవలే సెల్ ఫోన్ కంపెనీలన్నీ పోటీపడుతూ లైఫ్‌లాంగ్ ఇన్‌కమింగ్ ఫ్రీ ప్రకటించడంతో సుబ్బారావులో సెల్ కోరిక మరింతగా పాతుకుపోయింది. ఇక కాలచక్రలో బిచ్చగాళ్లు సైతం సెల్ వాడుతున్న ఫోటో చూశాక. "ప్రతి దిక్కుమాలిన వెధవా సెల్ వాడుతున్నాడు" అని వాపోయాడు.

సెల్‌కు భార్య అనుమతించకపోవడానికి కారణం ఉంది. ఇంట్లో, ఆఫీసులో ఫోన్ ఉంది, ఆఫీసు పక్కనే ఇల్లు కాబట్టి సెల్ అవసరం లేదని సుబ్బారావు భార్య కళ్లెం వేసింది. చివరికి కొత్తగా వచ్చిన ఫ్రీ ఆఫర్ చూపించాడు, స్నేహితుల ముందు తన పరువు పోతోందని, ప్రతి ఒక్కరూ సెల్ నంబరే అడుగుతున్నాడని భార్యకు చెప్పాడు. తనలో ఉన్న ఉత్తమనటుడిని ప్రదర్శించాడు, సాధించాడు అయితే దానికి బదులుగా పండక్కి పట్టుచీర వాగ్దానం చేశాడు.

సెల్‌కు అనుమతితో పాటుగా బడ్జెట్ కూడా విడుదల కావడంతో, తన స్నేహితుడు అప్పారావును కలిసి విషయం చెప్పాడు. అప్పారావు, జాలిగా సుబ్బారావు వంక చూశాడు.


"సెల్ కొనే విషయంలో మరోసారి ఆలోచించుకో.." విలువైన సలహా ఇచ్చాడు అప్పారావు.

"అదేంటి అప్పారావ్, అలా అంటున్నావ్? సెల్ కొనుక్కోవాలనే కోరిక ఇంత కాలానికి తీరుతుంటే ఆనందించాల్సింది పోయి, ఆలోచించుకో అంటున్నావ్?" నిష్ఠురంగా అన్నాడు సుబ్బారావు.

"సెల్ వల్ల ఉపయోగాల గురించి నువ్వు ఆలోచిస్తున్నావ్ కానీ, దాంతో వచ్చే కష్టాల్ నీకు తెలియవు సుబ్బారావ్! స్వీయానుభవంతో చెబుతున్నాను, అర్థం చేసుకో" మరో సారి చెప్పాడు అప్పారావు.

అయినప్పటికీ సుబ్బారావు నిర్ణయంలో ఎలాంటి మార్పూ రాలేదు. పైగా తను సెల్ కొనుక్కోవడం అప్పారావు అసూయ పడుతున్నాడని అనుకున్నాడు. చివరికి అప్పారావుతో కలిసి సెల్ వెబ్‌కు వెళ్లి తన కిష్టమైన సెల్ కొనుక్కున్నాడు. దాంతో సుబ్బారావు సెల్‌వాలా అయ్యాడు.

అటూ, ఇటూ నడుస్తూ, బైక్ నడుపుతూ స్టయిల్‌గా సెల్ మాట్లాడుతుంటే అందులో ఉండే ఆనందం వర్ణనాతీతం అని సుబ్బారావు మురిసిపోయాడు. స్నేహితులందరికీ ఫోన్ చేసి తన మొబైల్ నంబరిచ్చాడు. సెల్ వాడటంలో ఉన్న మజా వేరని ఖుష్ అయ్యాడు.



★★★ ★★★

ఉదయం నిద్ర లేవగానే సుబ్బారావు తన కొత్త సెల్ ఫోన్‌ను ఆప్యాయంగా చూసుకున్నాడు. చార్జింగ్‌లో పెట్టేసి బాత్రూంలోకి దూరాడు. కొద్ది క్షణాల తర్వాత తన మొబైల్ మోగిన సౌండ్ వినిపించింది. దాంతో టెన్షన్ పెరిగింది. వెళ్లేసరికి ఫోన్ కట్టవుతుందేమోననే టెన్షన్. ఎలాగైతేనేం, 'పని' ముగించుకుని పరుగెత్తుకుంటూ సోఫాపై నుంచి జంప్ చేసి ఫోన్ అందుకున్నాడు. కానీ, ఫోన్ కాల్ కట్టయింది. మిస్‌డ్ కాల్.

"ఛ..ఇక నుంచి బాత్రూంకి కూడా ఫోన్ తీసుకువెళ్లాలి" అనుకున్నాడు. మిస్‌డ్ నంబర్ ఎవరిదనేది ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు. దాంతో అదే నంబర్‌కు డయల్ చేశాడు. "హలో! నేను సుబ్బారావునండీ.. ఇందాక మిస్‌డ్ కాల్ చేశారు?

"ఓహ్.. మీరా సుబ్బారావుగారూ! మేము తకధిమితోం రింగ్ టోన్స్ గురించి చేశాం సర్. మీకు రింగ్ టోన్స్ కావాలా?"

సుబ్బారావు జవాబు చెప్పబోతూ ఆగాడు.

పక్కనే భార్య ఆసక్తిగా చూస్తోంది. తెలివిగా జవాబు చెప్పాలి. "అలాగా భలేవారండీ... వద్దు లేండి" అంటూ ఫోన్ కట్ చేశాడు, 'పొద్దున్నే ఔట్ గోయింగ్ కాల్ వేస్ట్' అనుకుంటూ.

"ఎవరండీ ఫోన్‌లో?" అనుమానంగా అడిగింది భార్య.

"అతను... అత...ను మా ఫ్రెండ్.. అప్పారావు" అన్నాడు. జరిగిన విషయం చెబితే దెప్పి పొడుస్తుంది.

★★★ ★★★ ★★★

మరో రోజు సుబ్బారావు సీరియస్‌గా తన సీట్లో



కూర్చుని ఫైల్స్ చూసుకుంటున్నాడు. ఇంతలో జేబులోని సెల్ ఫోన్ ట్రింగ్ ట్రింగ్‌మంది. చేస్తున్న పని ఆపేసి ఫోన్ చేతిలోకి తీసుకుని నంబర్ చూస్తూ రిసీవ్ చేసుకున్నాడు.

''హలో కొండాబాతుల సుబ్బారావుగారేనా?'' పలకరించింది అందమైన లేడీ కంఠం.

''అవును. కానీ నా పేరు కొండాబాతుల కాదు, కొండాబత్తుల సుబ్బారావు'' విసురుగా చెప్పాడు.

''ఓహ్ స్వీట్ నేమ్... నేను కుయ్యో మొర్రో బ్యాంక్ నుంచండీ. మీకు క్రెడిట్ కార్డ్ కావాలా?'' స్టయిల్‌గా అడిగింది.

దాంతో సుబ్బారావుకు సీన్ మొత్తం అర్థమైంది. ''నాకే విధమైన క్రెడిట్ కార్డ్ అవసరం లేదు'' సీరియస్‌గా చెప్పాడు. ఇలాంటి ఫోన్స్ వస్తాయనీ, జాగ్రత్తగా ఉండాలనీ ఫ్రెండ్స్ చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. ''అలాగే థ్యాంక్యూ హ్యావ్ ఏ నైస్ డే సర్'' అంటూ ఫోన్ కట్టయింది.

సుబ్బారావు మొబైల్ ఫోన్ తీసుకున్న నాల్రోజులకే ఇలాంటి కాల్స్ గురించి తెలిసిపోయింది.

కొద్ది క్షణాల తర్వాత మళ్లీ ఫోన్ మ్రోగింది. నాలుగు రింగ్‌లయ్యాక రిసీవ్ చేసుకున్నాడు. ''గుడ్‌మాణింగ్ సర్... మీరెవరో తెలుసుకోవచ్చా?''

సుబ్బారావుకు తిక్క రేగింది. ''ఎవరో తెలియకుండానే ఫోన్ చేశావా..?'' ఘాటుగా అడిగాడు.

''హి.. హీ... మీరు భలేగా మాట్లాడుతారు సార్... నేను టీటా కంపెనీ నుంచి. మీరు అదనంగా మరో ఫోన్ తీసుకోవాలనుకుంటున్నారా? కొత్త కొత్త స్కీమ్‌లు వచ్చాయ్ సార్... ఒక కాల్ చేస్తే మరో కాల్ ఫ్రీ., ఐఎస్‌డి చేస్తే ఎస్‌టిడీ ఫ్రీ, లోకల్ చేస్తే నాన్-లోకల్ ఫ్రీ...''

''ఉన్న ఫోన్ చాలమ్మా. మరో ఫోన్ కావల్సి వస్తే అడుగుతాలే!''

''ఓ.కే. సార్ హావ్ ఏ నైస్ డే..'' అంటూ అవతలి శాల్తీ చెప్పేసి ఫోన్ పెట్టేసింది. ఇంతలో ఫోన్ మళ్లీ మోగింది. నీరసంగా చేతిలోకి సెల్ తీసుకుని చూశాడు. ఈ సారి ఎస్.ఎంఎస్. వచ్చింది. డిటెయిల్డ్‌గా చూశాడు. ఫలానా చోట ఎగ్జిబిషన్ జరుగుతోందని వివరాలిచ్చారు.

సుబ్బారావుకు నీరసం వచ్చేసింది. క్షణానికో విధంగా బేవార్స్ కాల్స్ వస్తుంటే ఇక ఆఫీసు పని చేసుకోవడం తన వల్ల కాదని పించింది. క్యాంటిన్‌లో టీ తాగితే బెటరని బయటకు వెళ్లాడు. అక్కడ ఫ్రెండ్ అప్పారావు సెల్ ఫోన్‌లో నవ్వుతూ మాట్లాడ్డం కనిపించింది. సుబ్బారావును చూసి చెయ్యి ఊపాడు. బదులుగా సుబ్బారావు విష్ చేశాడు.

టీ తాగుతుండగా అప్పారావు దగ్గరగా వచ్చి, ''ఏం సుబ్బారావ్, సహజంగా ఈ టైమ్‌లో నువ్వు టీకి రావుగా?''

''అవున్రా.. కానీ ఈ సెల్ ఫోన్‌లతో పడలేకపోతున్నాను'' అంటూ జరిగింది చెప్పాడు.

''నేను ముందుగానే చెప్పాను, సెల్ ప్రాబ్లమ్స్. అయితా ఇదంతా స్పీడ్ యుగం. ఇన్‌ఫర్మేషన్ అందిస్తుంటే సంతోషించక అలా చిరాకు పడతావేంటీ?'' హితబోధ చేశాడు.

''అంతేనా..?''

''అవున్రా బాబూ.. నీకిష్టమైతేనే మాట్లాడు. లేదంటే కట్ చేసేయ్ '' అంటూ చిటికెలో పరిష్కరించాడు.

★★★ ★★★ ★★★

సుబ్బారావు బైక్‌పై మార్కెట్‌కు బయలుదేరాడు. ట్రాఫిక్‌లో తప్పించుకుంటూ, అభిమన్యుడిలా మెలికలు తిరుగుతూ బైక్ పోనిస్తున్నాడు. సిగ్నల్ పడే లోపు దాటాలని వేగం పెంచాడు. ఇంతలో జేబులో ఉన్న సెల్ మోగింది. బహుశా భార్య చేసిందేమో, వచ్చేపుడు మరేదైనా కొనుక్కురమ్మంటుందేమో అని ఆత్రుతతో అవస్థలు పడుతూనే, హెల్మెట్ తీసి పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టి, అపసోపాలు పడుతూ ఫోన్ లిఫ్ట్ చేశాడు.

''గుడ్ ఇవినింగ్ సర్.. నేను కిటకిట కంపెనీ నుంచి. మీరు క్లబ్ సభ్యత్వం తీసుకోవాలనుకుంటున్నారా.?'' అని స్వీట్ వాయిస్ నవ్వుతూ ప్రశ్నించింది.

సుబ్బారావుకు కోపం నసాళానికి చేరుకుంది. ''[illegible]!'' అంటూ అరిచాడు.

ఆ అరుపుకి పక్కనే వెళుతున్న చాలామంది తలలు తిప్పి విచిత్రంగా ప్లస్ ఆశ్చర్యంగా చూశారు.

సుబ్బారావు ముఖంలో రంగులు మారాయి.

ఇంతలో భుజంపై చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాడు ట్రాఫిక్ పోలీస్. బండి పక్కకి తీయమని చెప్పాడు.

''నేనేం చేశానండీ?'' అమాయకంగా అడిగాడు.

''డ్రయివ్ చేస్తూ సెల్ మాట్లాడితే నేరం. అందుకు రూ. 50 జరిమానం, హెల్మెట్ నెత్తిన పెట్టుకోకపోవడం మరో నేరం. అందుకు కూడా ఫైన్'' అంటూ బైక్ లాక్ తీసుకుని, పక్కకి రమ్మన్నాడు.

●